కథానిక

# ఆర్డినెన్స్ ఆఫ్ యమధర్మ రాజు

విషణ్ణ వదనాలతో దిగాలుపడిపోయిన కుటుంబాన్ని విడిచి వెళ్లాలంటే నరాలు తెగిపోతున్నట్టనిపించింది అనసూయమ్మకు.

అనసూయమ్మ చచ్చిపోయింది.

విశాలమైన హాలులో, ఎవరితోనూ సంబంధం లేకుండా, నిర్వికారంగా, నిశ్చలంగా వుండి వయోభారంతో కుచించుకుపోయిన ఆ వృద్ధకాయం.

అలా అని అనసూయమ్మ ఆర్ఫన్ కాదు. ఆమెది అనాధ శవం అంతకన్నా కాదు. అనగనగనగా... అన్నట్టు ఎప్పుడో చాలా ఏళ్ళ క్రితం పేగుల్ని తెంపుకుని ముత్యాల్లాంటి ముగ్గురు పుత్రరత్నాల కు జన్మనిచ్చింది. నేలపై నడిస్తే కందిపోతారేమోనన్న ఆరాటంతో గుండెలపై పెట్టుకుని పెంచింది. భర్త పోయిన తరువాత, వారి భవిష్యత్తునే తన వూపిరిగా చేసుకుని బ్రతికిన ఆ అనసూయమ్మ చివరికి చచ్చిపోయింది.

అదిగో! తలవైపు కూర్చుని దొంగచూపులు చూస్తూ గుండెలు బాదుకుంటుందే... ఆవిడ! పెద్ద కోడలు. ఏ క్షణంలోనయినా సొమ్మసిల్లి పోవచ్చన్న ఆదుర్దాతో బుజాలు పొదివి పట్టుకుని ఓదారుస్తున్నాడు చూశారూ! అతడు జ్యేష్ఠుడు.

పాదాలవైపు కూర్చున్నందువల్ల పొట్లాంలా ముడుచుకుపోయిన అనసూయమ్మ మెడలోని ముప్పేట గొలుసు సరిగ్గా కనబడడం లేదు కాబోలు... ముక్కు చీదుకుంటున్న నెపంతో కాస్తంత నిటారుగా గోడకు ఆనుకుని, తోటికోడలు వేలి కొనలను, అత్తగారి కంఠాభరణాన్ని సింగిల్ ఫ్రేంలో ఫిక్స్‌చేసి దీనంగా చూస్తున్నావిడ రెండో కోడలు. దృష్టి అటున్నదన్న మాటే గాని మనసంతా బయట వసారాలో హడావిడి చేస్తున్న భర్తపైనే. అసలే అమాయకుడు! భార్య నంటిపెట్టుకుని బుడిబుడిరాగాలు తీస్తున్న బావగారిలా లౌక్యుడు కాదు. జేబులో వున్నదంతా ఈ తతంగానికి వదిలించుకోవడం ఖాయం! ఆ తరువాత అడగనూ లేడు... అడిగినా పలికేవాడూ వుండడు.

"ఇంకా ఆలస్యం దేనికి... పొద్దుండగానే ముగిస్తే వుత్తమం..."

"మూడోవాడు ఢిల్లీ నుంచి రావాలి! రేపటిగ్గానీ చేరుకోడు..."

"అప్పటిదాకా ఇంతేనా... పద్ధతి కాదు మరి! చెప్పి చూడండి!"

"పెద్ద కోడలును చూస్తున్నావా? బ్రతికున్నప్పుడు నాలుగు మెతుకులు విదిల్చలేదు. క్షణక్షణం




కాల్చుకు తినడమే..."

"ష్! మనకెందుకూ! అసలే పెళ్ళికెదిగిన అమ్మాయి వుంది మనకు... ఎవరితో ఏ అవసరమో..."

"ఒకసారి పెద్దమ్మగారు ఊక్కపోస్తున్నదని వీకటి

# గురజాడ వీధి

## కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి



వద్దాక నాలుగు చెంబుల నీళ్ళు పోసుకుంటే, ఆ రెండోది ఎంత యాగీ చేసిందని... సినిమా యీరోయిన్లనూ రెండువూటలు నీళ్ళోసుకోవడా నికవి నానా కూతలు! మరివ్వడీ పానం లేని కట్టెకయినా చెంబెడు నీళ్ళు పోస్తరా అని..."

"యినబడ్తది! పోయినావిడ యెట్లాగూ పోయింది. యీ మాటలు చెవుల బడ్డాయంటె మనవని గూడా హుష్కాకీ..."

"దాని మొహం! యిది కాకపోతే యింకోటి! అల్ల ఏక్టింగ్ చూస్తూంటే ఉమ్మెయ్యబుద్దయితున్నది. నువ్వేమన్న అనుకో..."

"ష్! యిదేమన్న కొత్త విషయమా... ఏ యింట్లో చూసినా ఇదే కథ. ఊరుకో..."

వారి మాటలు వింటూంటే చివుక్కుమన్నది అనసూయమ్మ ఆత్మ. మరీ ముఖం పట్టుకుని కాకపోయినా, చాటుమాటుకిలా చెవికొరుకుడు వుంటుందని తెలియని నా కోడళ్ళు నిజంగావే అమాయకురాళ్ళు... పాపం! యింకిపోయిన కన్నీటితో దీనాతిదీనంగా కూర్చున్న పెద్దకోడలును చూస్తూంటె గుండె తరుక్కుపోయింది కాని... ఏం చేయగలదని? ఇప్పుడు తనొక విగతజీవి. జాలిపడడం మినహా మరేమీ చేయలేని నిస్సహాయురాలు.

ఇంతలోనే 'హ్హ...హ్హ...హ్హ' అంటూ చెవిదగ్గర వినిపించిన వికటాట్టహాసానికి ఉలిక్కిపడింది అనసూయమ్మ.

ముళ్ళగదలను బుజాలపై పెట్టుకుని, నోట్లోంచి బయటకు వచ్చిన కోరలను నాలుకతో తడుముకుంటూ చెరోవైపు ప్రత్యక్షమయారు ఇద్దరు మహాకాయులు.

భయపడలేదు... కాని, నిశ్చయంగా ఆశ్చర్యపోయింది అనసూయమ్మ. "యమభటులేనా..." అడిగింది పరీక్షగా చూస్తూ.

"హమ్మయ్య... మీ తరం వాళ్ళు యింకా వున్నారు కాబట్టే మాకీమాత్రం రికగ్నిషన్ మిగిలి ఏడ్చింది. అదే ఇప్పటి బచ్చాగాల్లయితే, 'ఎవరీ లుచాగాల్లని' పూరవతలిదాకా తరిమే వాళ్ళు.... థాంక్యూ... థాంక్యూ వెరీమచ్!" వంగి ప్రణామం చేస్తూ చెప్పాడు ఇద్దరిలో ఒకడు.

అనసూయమ్మకు చాలా కాలం తరువాత మొదటిసారిగా నవ్వు ముంచుకొచ్చింది. కాని, గమనించిన భటుడు ఆత్రంగా అడ్డుపడ్డాడు, "ఓ మైగ్గాడ్! నువ్విప్పుడు నవ్వగూడదు బామ్మా! విచారంగా మా వెంట రావాలి. అదన్న మాట సీను! బయల్దేరు..." అంటూ, "అదేమిట్రా వెధవా... అలా నిలబడిపోయావ్? నడు!" దిక్కులు చూస్తున్న కొలీగ్‌ను గదమాయించాడు.

విషణ్ణ వదనాలతో దిగాలుపడిపోయిన కుటుంబాన్ని విడిచి వెళ్ళాలంటె నరాలు తెగిపోతున్నట్టనిపించింది అనసూయమ్మకు మాత్రం.

"అబ్బబ్బా... ఏమిటండీ థింకింగూ? లేటయితే చీవాట్లతో మా తలలు వాచిపోతాయి మళ్ళీ..."

"ఏమోరా అబ్బీ! వీళ్ళను విడిచి రావాలంటె హృదయం తరుక్కుపోతున్నది..." దీనంగా అన్నది.

"అదేమిటి బామ్మా! ప్రాణం పోయే క్షణం దాకా మాటలతో, చేతలతో టార్చర్ చేస్తూ, 'ఎప్పుడెప్పుడు

**కన్నీళ్ళు ధారగా కారిపోతుంటే అలాగే నిల్చుండిపోయింది**

**యమధర్మరాజు సమక్షంలో**

చస్తుందా ముసల్దీ' అని ఎదురు చూసిన ఈ వెధవల గురించా నీ ఆరాటం... వాళ్ళు చంపేవరకు ఆగకుండా తీసుకుపోతున్నందుకు మా బాస్‌కు థాంక్స్ చెప్పుకోవాలి. పద!" కినుక్కున నవ్వుతూ అన్నాడీసారి భటుడు.

"అంతేలే..." ఇక తప్పదన్నట్టుగా అంటూ, చివరిసారిగా అందరినీ ఒకసారి తనివిదీరా చూసుకుని బయల్దేరింది గాఢంగా నిట్టూరుస్తూ.

యమలోకంలో ప్రవేశించినాక మాత్రం నివ్వెరపోయింది అనసూయమ్మ.

పై కప్పులేని ఆవరణలో అసంఖ్యాకంగా వున్న లావుపాటి స్తంభాలు... ప్రతి స్తంభం మొదట్లో పెద్ద సైజు గాడిపొయ్యిలు... ఎగసిపడుతున్న మంటలపై భారీ బానల్లోంచి హాహాకారాలు చేస్తున్న వివిధరకాల ఆకారాలు. విచిత్రమేమిటంటే, సల సలకాగుతున్న నూనెలో మరుగుతున్న వాళ్ళు, స్తంభాలకు బిగించిన కొయ్యలకు తల్లకిందులుగా వేలాడుతున్నవాళ్ళూ, ఎర్రగా కాలుతున్న నిప్పుకణికలపై పొర్లాడుతున్నవాళ్ళూ... వారూ, వీరనేమిటి, అంతా స్త్రీలే కావడం విశేషం. ఆశ్చర్యంతో తలమునకలయిపోయింది. ఆమె నివ్వెరపోయింది కూడా అందుకే.

"హమ్మయ్య! వచ్చారా! వెల్‌కం... వెల్‌కం!" వారిని చూస్తూనే వైడ్ యాంగిల్‌లో నవ్వుతూ ఆహ్వానించాడు రాజస్థానీ టైపులో రుమాలు కట్టుకున్న చిత్రగుప్తుడు.

అతడి మాటలు వినిపించుకోలేదు అనసూయమ్మ.

సింహాసనం పక్కనే చొంగ కార్చుకుంటూ నెమరువేస్తున్న కింగ్‌సైజు దున్నపోతు కొమ్ములకు గదను వేలాడదీసి విశ్రాంతిగా కునుకుతీస్తున్నాడు యమధర్మరాజు. అతడినే చూస్తూండిపోయింది.

అది గమనించిన చిత్రగుప్తుడు "ఆయనే ఈ లోకానికి బాసు. మిస్టర్ యమా..." ముందుకు వస్తూ ఇంట్రడ్యూస్ చేశాడు.

"కనిపిస్తూనే వుందిగా దున్నపోతు. వేరే చెప్పాలా.." ముఖం చిట్లించుకుంటూ టకీమని అంటించింది అనసూయమ్మ.

ఖంగుతిన్నాడా డైలాగుకు చిత్రగుప్తుడు.

"మరేంటయ్యా? డ్యూటీ టయింలో మీ బాసు యిలా కునికిపాట్లు పడ్తున్నందువల్లే, తప్పుడు పనులు చేస్తునవ వెధలవంతా అక్కడ కాలరెత్తుకుని తిరుగుతున్నారు. చిన్నా, చితకా భటుడు ముండాకొడుకులను పంపిస్తే నాలాంటి ముసల్దాన్ని ఎత్తుకురాక ఇంకేం చేస్తారుట..."

మళ్లీ షాకయిపోయాడా కామెంట్స్‌కతడు.

"అదేమిటి మహిళా! యమలోకానికొచ్చి గజగజా వణకడమటుంచి ఇంత డామేజింగ్ స్టేట్‌మెంటివ్వడం ఏం బాగాలేదు సుమీ!" నొచ్చుకుంటూ అన్నాడు.



నంబర్ వన్ స్టార్, డాన్సింగ్ సెన్సేషన్ అయిన కరిష్మాకు ఇష్టమైన సినిమాలలో ఏంటో బర్సాత్ (రాజకపూర్) మదర్ ఇండియా, కాగజ్‌కేఫూల్, సౌండ్ ఆఫ్ మ్యూజిక్ వంటి వాటి పేర్లు చెప్పింది కానీ తాను నటించిన సినిమాల పేర్లు చెప్పనే లేదు. అంటే ఈకాలం సినిమాలు పనికిరావనే గా.
విజయ్ వర్మ

"సుమీ లేదు.. ముష్టం డబ్బీ లేదు. ఊరుకోవయ్యా – ఊరుకో! అల్లు రామలింగయ్య గెటప్పూ నువ్వూనూ! బ్రతుకంతా భయంతోనే గడిపిన మనిషిని... ఇక చచ్చిం తర్వాత గూడా గజగజ వణకడమేమిటి నీ మొహం! అయినా... నాకు తెలియక అడుగుతున్నానూ... దొంగ వెధవలనంతా వదిలిపెట్టి, ఇదేమిటి... ఇక్కడంతా ముసలి ముండలనే కట్టిపడేశారూ..." అడగదల్చుకున్నదేదో సూటిగానే అడిగేసింది.

అప్పుడు మాత్రం, 'హు...' అంటూ నిట్టూర్చాడు చిత్రగుప్తుడు.

"ఏం చెప్పమంటావు మహిళా! గూండాలూ, హంతకులూ అంత యీజీగా దొరికి చావడం లేదు. మొన్నటికి మొన్న అదేదో జైల్లో ఇద్దరికి ఉరిశిక్ష వేశారు చూశావా.. తీరా వెళ్ళేసరికి, 'ఇప్పుడు కాదు.. మళ్ళీ రండని' బిచ్చగాళ్ళను తరిమినట్టు తరిమేశారు. అలా ఎన్నిమార్లనుకున్నావ్.. ఫోర్ టైమ్స్! పరుగులు పెట్టీ...పెట్టీ మా దుంప తెగిందనుకో..."

"హార్నీ..." అంటూ బుగ్గలు నొక్కుకుంది అనసూయమమ ఆ మాటలు వింటూ.

ఆవిడ విస్తుపోతూంటే 'హమ్మయ్య' అనుకున్నాడు చిత్రగుప్తుడు. ఇంకో నాలుగు ఇంట్రెస్టింగ్ మాటర్స్ వదిల్తే, బాసు లేచేసరికి ఆడవి పెడసరం కాసింతలో కాసింతయినా కంట్రోలవుతుందనిపించింది. అందుకే వెంటనే అందుకున్నాడు.

"అంతేకాదు తల్లీ! హంతకుల... గింతకుల వ్యవహారం అలా వుండా! ఇక మీ లీడర్లూ, స్కామ్‌స్టర్సుల నిర్వాకం విను. మా బాసేమో పాతకాలం పెద్దమనిషి. ఆరుబయట కూర్చుని ఓ పెన్‌గా ఆర్డర్లు వేస్తుంటాడు. ఇటువైపింకా సంతకం కూడా కాదు... అటు లీకేజీ స్టార్ట్! మరుక్షణం విమానా లెక్కి తుర్రో... తుర్రు! వెంటపడదామంటే, వీసా, గీసా... ఎక్స్‌ట్రాడిషన్నూనూ! అబ్బో... మావల్ల కావడం లేదు బాబూ! అదేంటో అర్థమయి చావడం లేదు కానీ, మహిళా! మీ వాళ్ళు ఫారిన్‌కు పారిపోయి కాన్సర్లూ, ఎయిడ్సుల నుండి కూడా ఎస్కేపింగయిపోతుంటే ఇంకేం చెయ్యాలి... నువ్వే చెప్పు! యమలోకం ఖాళీ అయి... మా వాళ్ళంతా సోమరిపోతులయిపోతూంటే, సరికొత్త పాపాలన్ను జోడించి మా బాసు ఒక ఆర్డినెన్స్ జారీ చేశాడు..."

బొమ్మలా వింటూండిపోయిన అనసూయమ్మ అదేమిటో అడుగుదామనుకుంటుండగనే 'ష్.' అంటూ సైగ చేశాడు సింహాసనం వైపు కళ్ళెగరవేస్తూ.

కదులుతూ కళ్ళు నులుముకుంటున్నాడు యమధర్మరాజు.

"ఏమయ్యా గుప్తా! ఎంతసేపయిందీ పాపిని తోడ్కొచ్చి..." ఆవులించడం అయిన తర్వాత అడిగాడు నింపాదిగా.

"ఎవరయ్యా పాపి...? మాటలు మర్యాదగా రానీ! పుట్టినప్పటినుంచి గిట్టేంతవరకూ చీమకుగ్గూడా అపకారం చేసి ఎరుగను. జీవితమంతా పూజలతో... ఉపవాసాలతో గడిపినదానిని! కొడుకుల మాటలతో, కోడళ్ళ చేతలతో చిత్రవధ అనుభవిస్తూ, చివరికి మనవలు, మనవరాళ్ళ చీదరింపులు కూడా భరిస్తూ, చచ్చింతర్వాత నయినా గ్యారంటీగా స్వర్గానికి వెళ్తానన్న భరోసాతో వున్న నన్ను కుట్రతో లాక్కొచ్చింది చాలక, నన్నే పాపి అంటున్నావా..." ఉక్రోషంతో చెడామడా దులిపేసింది.

అయినా కోపం తెచ్చుకోలేదు వాళ్ళు. పైగా కినుక్కున నవ్వాడు చిత్రగుప్తుడు. యముడు కూడా సింహాసనంలోనే టువైపు తిరిగి ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు. ఆ తర్వాత చిత్రగుప్తుని వైపు ప్రశ్నార్థకంగా చూస్తే, అతడు కూడా సైగ చేశాడు తల అడ్డంగా వూపుతూ.

"ఆహా.. మనం రీసెంట్‌గా జారీచేసిన ఆర్డినెన్స్ గురించి చెప్పలేదన్న మాట. అందుకే మహిళకు తను చేసిన పాపాలేమిటో బోధపడడం లేదు..." అన్నాడు మళ్ళీ వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకుంటూ.

అంతా అయోమయంగా వుంది అనసూయమ్మకు. 'తను పాపం చేయడమేమిటి... ఈ కొత్త ఆర్డినెన్సేమిటి' అర్థం కాలేదు.

"కన్‌ఫ్యూజు కావద్దు మహిళా! మేం కొత్తగా ఇష్యూ చేసిన ఆర్డినెన్స్ ప్రకారం నీవు చేసిన పాపాల చిట్టా మా గుప్తా విప్తాడు. జాగ్రత్తగా విను. అంతా నీకే తేటతెల్లమవుతుంది..." అంటుండగనే చిట్టా మడతలు విప్పడం ఆరంభించాడు చిత్రగుప్తుడు.

అనసూయమ్మలో కూడా కుతూహలం పెరిగిపోయింది, అదేదో వినాలని.

"ఆ... ఆ..! ఇదిగో! ఇక్కడ!" అని ఎక్సయిటయిపోతూ ప్రారంభించాడు చిత్రగుప్తుడు, "పెళ్ళయ్యేదాకా ఈవిడ ఖాతాలో ఏ ఎంట్రీలూ లేవు బాస్! మెడలో మూడు ముళ్ళు పడ్డ క్షణంలోనే 'ఏడాది తిరిగే సరికల్లా పండంటి బిడ్డ.. అదీ మగబిడ్డే కావాలని ముక్కోటి దేవుళ్ళకు మొక్కుకుంది అదే ఫస్ట్ ఎంట్రీ..."

"పండంటి బిడ్డను కోరుకోవడం కూడా పాపమేనా..." విస్తుపోతూ అంది అనసూయమ్మ.

"పండంటి బిడ్డ కావాలనుకోవడం పాపం కాదు. కానీ.. మగబిడ్డను మాత్రమే కవాలనుకోవడమయితే ఆర్డినెన్స్ ప్రకారం నేరం... నెక్స్ట్!" చెప్పాడు యముడు.

"ఒకరు... ఇద్దరు కాదు మహాప్రభో! అలా మొత్తం ముగ్గురు వెధవలకు జన్మనిచ్చిందీ మహిళ. అదీ కడుపు పండిన ప్రతిసారీ మగబిడ్డే కావాలని పూజలు చేసింది... పుణ్యక్షేత్రాలు తిరిగింది. ఆడ శిశువును మాత్రం ససేమిరా ప్రసాదించవద్దని పదేపదే స్పెషల్‌గా వేడుకుంది..."

"శివశివా!" అంటూ చెవులు మూసుకున్నాడు యమధర్మరాజా మాటలు వింటూనే, "విన్నావా మహిళా! నీవు చేసిన ఘోరాతి ఘోరమైన పాపం ఇప్పటికయినా తెలిసిందా! ఆడదానివై వుండీ, ఆడ శిశువు వద్దనుకోవడమే కాకుండా, కడుపులో పడకముందే భ్రూణహత్యకు పాల్పడ్డావు. పైగా... 'ఒకరు లేక ఇద్దరితో చాలించండర్రా' అని లోకం కోడై కూస్తుంటే, నువ్వు మాత్రం ఏకంగా ముగ్గురిని కనేశావు. ఇది పాపం కాక మరేమిటి?" కాస్త గద్దింపు స్వరంతోనే అడిగాడు.

"ప్రత్యక్షంగా ఈ పాపం చేసిన ఈవిడ, పరోక్షంగా ఎన్ని అనర్థాలకు కారణభూతురాలయిందో చిత్తగించండి ప్రభూ!" అంటూ సాగించాడు చిత్రగుప్తుడు. "ఈవిడ మాదిరి ఇరుగు పొరుగు మహిళలందరూ పోటీలు పడి మరీ పూజలు చేస్తూ మగబిడ్డల్ని కంటున్నారు ప్రభూ! దీనివల్ల చిరకాలంగా వస్తున్న జనాభా సమస్యను అలా వుంచితే... సమాజంలో మరో సరికొత్త సమస్య తలెత్తింది..."

"అందుకే కదా... కొత్త పాపాలను పొందుపరుస్తూ మనం ఆర్డినెన్స్ జారీ చేసింది... అయినా, ఆవిడక్కూడా తెలియాలి కదా... చెప్పను పో!" తల పంకించాడు యముడు.

"ఇలా ఇష్టం వచ్చినంతమందిని కనేస్తుండడంతో అనారోగ్యం, నిరుద్యోగం, తీవ్రవాదం ఇంకా ఎన్నో ప్రాబ్లమ్స్ పుట్టుకొచ్చినయి. సంతానం అధికం కావడంతో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నయి..."

"అబ్బబ్బా... గుప్తా! ఇంతకాలంగా ఉద్యోగం చేస్తున్నా, ఇంకెప్పుడు నేర్చుకుంటావయ్యా! వీటన్నింటిపై సెమినార్స్‌పై సెమినార్స్ పెట్టి ఊదరకొట్టేశావు కదయ్యా... మళ్ళీ ఏకరువు పెడ్తూ టైం వేస్ట్ చేస్తావేమిటకి? అసలు విషయానికి రావయ్యా మగడా..." విసుగ్గా అనడంతో చిన్నబుచ్చుకున్నాడు చిత్రగుప్తుడు.

"సారీ బాస్... అలవాటయిపోయింది మరి! సరే! కొత్త ఆర్డినెన్స్ ప్రకారం ఈ మహిళను ఇక్కడికి తీసుకురావడానికి కారణమయిన పాపాలను మాత్రమే వివరిస్తాను. ఆలకించండి!" అంటూ గొంతు సవరించుకున్నాడు.

"ఒకరి తర్వాత ఒకరు మొత్తం ముగురిని కని, అల్లారుముద్దుగా పెంచుకున్నదా, ఈ తల్లి... ఇక వినండి ప్రభూ! వారిని పెద్దచేసి.. పెళ్ళిళ్ళు చేసింది. ఆర్థికంగానే కాక... అన్ని రంగాల్లోనూ వారు రకరకాలుగా స్థిరపడిపోయారు. అలాగే డిఫరెంట్ నేచర్స్, డిఫరెంట్ బ్యాక్‌గ్రౌండ్స్ గల జీవిత భాగస్వాములు వారికి లభించారు. ఈ తతంగమంతా అయ్యేసరికి ఈవిడ పెద్దదయిపోయింది. భర్త పోయిన తర్వాత మిగిలిన కొద్దిపాటి

---

'వార్నింగ్'

తల్లిదండ్రులూ! తస్మాత్ జాగ్రత్త!

'ఆర్డినెన్సాఫ్ యమధర్మరాజా' బారిన

పడకుండా వుండడం మీ చేతుల్లోనే

వుంది! మిమ్మల్ని మీరు రక్షించుకోండి!'

'రచయిత'

---

ఆస్తిని తెగనమ్మి వారిని ప్రయోజకులను చేసిందనే చెప్పాలి ప్రభూ! కాని ఈవిడ మాత్రం ఏ ఆధారం లేకుండా కట్టుబట్టలతో, మెడలో ఒక ముప్పేట గొలుసుతో మిగిలిపోయింది. ఆవిధంగా ఇలాంటి వాళ్ళతో మరో కొత్త సమస్య తలెత్తింది... దానికి సృష్టికర్త ఈ మహిళే! ఈవిడ ఇక్కడికి రావడానికి అదే సమస్య కారణమయింది ప్రభూ!"

చెవులన్నీ చిప్పకుని వింటున్న అనసూయమ్మకు జీవితమంతా గిర్రున కళ్ళముందు తిరుగుతున్నట్టనిపించింది.

"ఒక్కడే పుత్రుడున్నట్టయితే, వాడికోసం వెచ్చించిందే కాక, తమ వృద్ధాప్యంలో అవసరానికి కూడా కొంత మిగుల్చుకోగలిగేది. పైగా... ఒక్కడే అయితే, నచ్చినా... నచ్చకున్నా, కట్టుకున్న దానికి ఇష్టమున్నా.. లేకపోయినా, లోకం కోసమయినా బ్రతికినంతకాలం తల్లిని చూసుకునేవాడు. అప్పుడీ సమస్య... అదే వృద్ధాప్యంలో మానవులెదుర్కొంటున్న ఈ సమస్య బయటకు పొక్కేది కాదు.. మనకీ ఆర్డినెన్స్ జారీచేసే అవసరమూ వుండేది కాదు..."

అనసూయమ్మకిప్పుడు అర్థమయీ.. అవనట్టు వుందంతా. అదే మాట అడిగింది. ఆ కంఠంలో మొట్టమొదటి పెడసరం లేదు. బలవంతంగా గొంతు పెగల్చుకున్నట్టు వచ్చిందా మాట.

"అదేనమ్మా... చెప్తున్నదీ!" అంటూ చెప్పుకుపోయాడు చిత్రగుప్తుడు మళ్ళీ, "ముచ్చటగా ముగ్గురిని కని, వున్నదంతా వారికోసం ధారపోశావు... మ్యాడమ్ మనుష్యులుగా ట్వంటీఫస్ట్ సెంచరీలోకి పంపాలనుకున్నావు కాని, కావడిలో తల్లిదండ్రులను మోసిన పురాణ కథ నెప్పుడయినా వినిపించావా? ఎంతసేపూ, ఆఫీసర్లు కావాలన్న ఆరాటమే కాని, సివరంత సంస్కారాన్ని వారిలో నింపే ప్రయత్నం ఎప్పుడయినా చేశావా అసలు? చివరికేమయింది? కట్టుకున్నవాళ్ళ కనుసన్నలలో బందీలయిపోయారు. కుటుంబం కోసం త్యాగాలు చేసేందుకు వారు మీ తరం వాళ్ళు కాదుగా... 'నేను' అన్న తర్వాతనే భర్త, భార్య, ఎవరయినా, అనే స్వార్థాన్ని నరనరాన నింపుకున్న ఈ తరం ప్రతినిధులు వాళ్ళు. ఇక అంతటి స్వార్థపరుల నిఘంటువుల్లో ముసలి పదాలకు స్థానం వుండదు. మమతానురాగాలకు, అనురాగాప్యాయతలకు అర్థాలు దొరకవు. తమకూ వృద్ధాప్యం తప్పదని, అప్పుడొక ఆలంబన అవసరమవుతుందని, ఒక అనురాగ వీచికకోసం తపించవలసి వుంటుందన్న వాస్తవాన్ని గుర్తించడానికి కూడా ఇష్టపడని తరమిది. అందుకే నీకీ స్థితి దాపురించింది.

నిస్సహాయురాలయిన వృద్ధ మాతృమూర్తిని మధ్యలో నిలబెట్టి నువ్వంటే నువ్వని క్రూరమృగాలున్న ఏ బోనులోకి నెట్టెయ్యాలా అని పోటీలు పడ్డారు నీ పుత్రరత్నాలు. మరణంకోసం ఎదురుచూడడం కన్నా భయంకరమైన మానసిక స్థితిలోకి తోసేశాడు. అందుకు కారకులెవరు?

అలాంటి నికృష్టులను అందించి సమాజం భ్రష్టుపట్టడానికి హేతువయిన నీవు కాదా?

స్మగ్లర్సునూ, హంతకులనూ శిక్షించడానికి మీ లోకంలో చట్టాలున్నాయి కాని, వృద్ధాప్యంలో నిస్సహాయులైన తల్లిదండ్రులను వీధులపాలు చేస్తున్న సంతానాన్ని, అలాంటి వారిని సృష్టించి, పెంచి, పోషిస్తూ సమాజాన్ని మలినం చేస్తున్న తల్లిదండ్రులను శిక్షించడానికి మాత్రం మీకెలాంటి చట్టాలు లేవు.

అందుకే మేమిక్కడొక స్పెషల్ ఆర్డినెన్సును అర్జెంటుగా ఇష్యూ చేయవలసి వచ్చింది. నిన్ను తీసుకువచ్చింది కూడా అదే ఆర్డినెన్స్ ప్రకారం. కళ్ళముందు జరుగుతున్న వాస్తవాలను గ్రహించకుండా... భవిష్యత్తును ఊహించకుండా బాధ్యతారహితంగా ప్రవర్తించే తల్లిదండ్రులను కఠినంగా శిక్షించి, గుణపాఠం చెప్పడమే ఈ ఆర్డినెన్స్ ఉద్దేశ్యం. ఆ.. ఇంకో విషయం! ఇక్కడంతా స్త్రీలే ఎందుకున్నారని అడిగావు కదూ? వాళ్ళంతా నీలాంటి మాతృమూర్తులే..."

మిగతా మాటలు వినబడడం లేదు అనసూయమ్మకు. కన్నీళ్ళు ధారగా కారిపోతూంటే. అలాగే నిల్చుండిపోయింది యమధర్మరాజు సమక్షంలో. ●